**Eenadu**

# తెలంగాణలో యువతకు కొత్త స్వయం ఉపాధి పథకం

## ● మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఉపాధి పథకాన్ని చేపట్టింది. దీనిని యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. మూడు విభాగాల కింద రుణసాయం అందించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే దీనిని అమలు చేస్తామని యువజన సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. యువతకు అండగా నిలిచేందుకు, అభివృద్ధి పథంలో నడిపేందుకు ఈ పథకం చేపట్టినట్లు చెప్పారు. పథకం మార్గదర్శకాలను ఉత్తర్వుల్లో వివరించారు.

★ మొదటి విభాగంలో యువతకు రూ.లక్ష వరకు సాయం. ఇందులో 80 శాతం సబ్సిడీ, మిగిలిన 20 శాతం రుణంగా పరిగణిస్తారు.

★ రెండో విభాగంలో రూ 1.01 లక్షల నుంచి రూ. రెండు లక్షల వరకు సాయం. ఇందులో 70 శాతం సబ్సిడీ. మిగిలిన 30 శాతం రుణం.

★ మూడో విభాగంలో రూ.2.01 లక్షల కంటే ఎక్కువ సాయం. ఇందులో 60 శాతం వరకు సబ్సిడీ (రూ. అయిదు లక్షల పరిమితి)గా ఉంటుంది. మిగిలింది రుణంగా పరిగణిస్తారు.

### అర్హతలు

★ 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. లక్ష, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల ఆదాయ పరిమితి ఉన్నవారు.

★ మొదటి విభాగంలో ఏడో తరగతి, రెండో విభాగంలో పది, మూడో విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులు.

### ఎంపిక పద్ధతి

యువజన సంక్షేమ శాఖ జిల్లాల వారిగా లక్ష్యాలను నిర్ధారిస్తుంది. స్టెప్ సీఈవోలు మండలు, పురపాలక లక్ష్యాలను ఖరారు చేస్తారు. సంబంధిత పురపాలక కమిషనర్లు, మండలాభివృద్ధి అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తారు. ఎంపీడీవోలు/కమిషనర్లతో పాటు బ్యాంకు అధికారులు, స్టెప్ అధికారులతో కూడిన ఎంపిక కమిటీ దరఖాస్తులను పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తుంది. ఆ తర్వాత వాటిన జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి పంపిస్తారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ తుది జాబితాను ఖరారు చేస్తుంది. చిన్న తరహా పరిశ్రమలు, విద్యావంతులకు ప్రాధాన్యం ఇస్తారు. ఎంపిక అనంతరం వారికి పారిశ్రామికి అభివృద్ధి కార్యక్రమం (ఈడీపీ)కింద శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందిస్తారు.